క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలివేలుమంగమ్మ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణం చేపట్టారు. ఈ పూజల్లో ఆలయ ప్రధాన అర్చకులు మావుడూరి సుబ్రహ్మణ్య శర్మ, భక్తులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న బూర్లె శ్రీనివాసరావు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్‌ఆర్ కాలనీ సర్పంచ్ అడపాక శంకరరావు ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని, అదే పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె శ్రీనివాసరావు ఎంపీడీఓ ఎం.పావనికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఆర్‌ఆర్ కాలనీ నిర్మాణం సమయంలో తవ్విన బోరుకు సంబంధించిన బిల్లులు చేయించుకుని పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు తెలిపారు. గతంలో కూడా ఇదే విషయమై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అకాల వర్షం



పొందూరు: దళ్లవలస వద్ద కురుస్తున్న వర్షం

పొందూరు/బూర్జ: పొందూరు, బూర్జ మండలాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల సాయంత్రం వరకు చిరు జల్లులు కురిశాయి. భానుడు ప్రతాపంతో అల్లాడుతున్న ప్రజలకు వర్షంతో ఊరట కలిగింది.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు



పుస్తకాలను పేర్చుతున్న ఎమ్మార్సీ సిబ్బంది

పొందూరు: స్థానిక మండల వనరుల కేంద్రానికి (ఎమ్మార్సీ)కి ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు చేరాయి. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఒకటో తరగతి నుంచి ఎనిమిదో, పదో తరగతి విద్యార్థులకు ఇవ్వాల్సిన పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ పీవీ రామరాజు సోమవారం తెలిపారు. తొమ్మిదో తరగతి పుస్తకాలు రావాల్సి ఉందని చెప్పారు. మొదటి విడతగా 16,432 పుస్తకాలు మాత్రమే అందాయన్నారు. పుస్తకాలను సీఆర్పీలు క్లస్టర్ల వారీగా పేర్చారు.

పరామర్శ..



పాతపట్నం: వైస్‌ఎంపీపీని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండలంలోని పాసీగంగుపేట గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ గంగు శోభరాణి భర్త వాసు ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాసీగంగుపేటలోని వైస్ ఎంపీపీ ఇంటికి సోమవారం వెళ్లి పరామర్శించారు. వాసు చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ తాతయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

హిరమండలం: మండలంలోని కొమనాపల్లి గ్రామంలో ఇటీవల పిడుగుపడి మృతిచెందిన ఎండు మన్మథరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం పరామర్శించారు. మృతుడి భార్య కృష్ణవేణికి ధైర్యం చెప్పి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తహసీల్దార్ బి.మురళీమోహన్, సర్పంచ్ గోవిందరావు ఉన్నారు.

నేటినుంచి కోటదుర్గమ్మ ఉత్సవాలు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం గ్రామంలో మంగళవారం నుంచి కోట దుర్గమ్మ అమ్మవారి 33వ వార్షికోత్సవ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి సోమవారం తెలిపారు. మూడు రోజులపాటు ఉత్సవాలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రత్యేక పూజలతోపాటు ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పీఏసీఎస్‌ల ద్వారా ఉత్తమ సేవలు



బుడితి కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్, డీసీసీబీ చైర్మన్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మేలైన సేవలందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని సారవకోట, బుడితి పీఏసీఎస్‌లకు నూతనంగా ఎంపికైన కార్యవర్గం సభ్యుల ప్రమాణ స్వీకారానికి సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఏసీఎస్‌లను మరింత బలోపేతం చేసి రైతులకు మేలైన సేవలందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ రైతులు మార్చిలోగా రుణాలు రెన్యువల్ చేసుకుంటే వడ్డీ రాయితీలు వర్తిస్తాయన్నారు. పీఏసీఎస్‌లలో గొడౌన్ అవకాశం ఉన్నవారికి ఎరువులు మేలోనే అందజేస్తామన్నారు. డీసీసీబీ సేవలను మరింత విస్తృతం చేస్తున్నామని, కమర్షియల్ బ్యాంకులకు దీటుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పీఏసీఎస్‌లకు చైర్మన్లుగా ఎంపికైన గెల్లంకి వెంకటరావు, మెండ సన్యాసిరావు, డైరెక్టర్లు గొర్లె ఢిల్లీరావు, కోరాడ అప్పయ్య, పొన్నాన హరిప్రసాద్, బోర శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

వైద్య రంగానికి పెద్దపీట

ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం పునఃప్రారంభించారు. నాడు–నేడు పథకం దార్వా రాష్ట్ర ప్రభుత్వం రూ.35 లక్షలు మంజూరు చేసి ఆస్పత్రిని అభివృద్ధి చేసిందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యం అందజేస్తుందన్నారు. టీడీపీ పాలనలో ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతీ గ్రామానికి వైద్యులు వెళ్లి వైద్య సేవలందిస్తున్నారన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనురాధ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీతులసి, తహసీల్దార్ ప్రవల్లికాప్రియ, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీలు గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, శంకర బాబు, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, గెల్లంకి వెంకటరావు, రావాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



శాంతినగర్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాతటప్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం–2 పరిధిలో గల శాంతినగర్, అంతరాబ కూడలిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకూ వెళ్లి ప్రతీఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. సీఎం వైఎస్ జగన్ మీ కష్టసుఖాలను తెలుసుకోవాలని తనను పంపించారన్నారు. సీఎం జగన్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను తెలియజేయడంతోపాటు వారు పొందిన లబ్ధిని గుర్తుచేసి బుక్‌లెట్‌లు అందజేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కరించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, మండల సచివాలయ కన్వీనర్ వై.సూర్యం, బి.నారాయణమూర్తి, పనుకు మోహన్, రాము, వరదరాజులు, ప్రవీణ్, రామారావు, సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సందడిగా సంబరాలు



కొత్తూరు: కాళీమాత వేషధారణ



హిరమండలం: నీలామణి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామ దేవత చెవిటమ్మ తల్లి సంబరాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే గ్రామ పండగలను ఈ ప్రాంతంలో ఘనంగా నిర్వహిస్తారు. రెండోరోజు సోమవారం గ్రామ దేవతలకు ముర్రాటలతో చల్లదనం చేశారు. గ్రామంలో సాంస్కృతి కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు.

విద్యుత్ వెలుగులు...

హిరమండలం: పాతహిరమండలంలో నీలామణి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 12 ఏళ్ల తరువాత ఈ సంబరాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని అన్ని వీధులన్నీ విద్యుత్ వెలుగులతో ధగధగలాడుతున్నాయి. రెండో రోజు సోమవారం ఘటాలతో పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



హిరమండలం: విద్యుత్ కాంతులు

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని రామలింగేశ్వరస్వామి పుష్కరి ఆవరణలో గల అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తమ్మినేని విద్యాసాగర్ దంపతులతోపాటు, అయ్యప్ప భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. అయ్యప్ప భక్తులు, గురుస్వామి రమణయ్య, సిల్లా మల్లికార్జునరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం సోమవారం వైశాఖ మాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా ఘనంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చక్కగా అలంకరించి తిరువీధి నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరులను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

కొత్తూరు: రానున్న ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేయనున్న యాక్షన్ ప్లాన్ వాల్‌పోస్టర్‌ను ఏఓ శ్రీనివాసరావు, స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ యాంకర్ బాబాజీలు సోమవారం స్థానిక ఆర్‌బీకేలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు కింద ఆరు రకాల చిరుధాన్యాలు సాగు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఖరీఫ్‌లో పొలం గట్లపై కంది, కూరగాయల సాగు చేసేందుకు అవసరమైన విత్తనాలను రాయితీపై పంపిణీ చేస్తామన్నారు. లబ్బ గ్రామంలో 23వ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

వీధి కుక్క స్వైరవిహారం

- నలుగురికి గాయాలు

హిరమండలం: మండలంలోని తుంగతంపర కాలనీలో వీధి కుక్క స్వైరవిహారం చేసి నలుగురిని గాయపరిచింది. ఈ ఘనట సోమవారం జరిగింది. పోలాకి పోలమ్మ, ఎందవ సింహాచలం, పనుకు సుబ్బలక్ష్మి, వి.భార్గవి గాయపడ్డారు. వీరిని చొర్లంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు.



చేతిపై గాయాన్ని చూపిస్తున్న పోలమ్మ

ఘనంగా కార్మిక దినోత్సవం

శ్రమదోపిడీని నిరసిస్తూ, ప్రపంచ కార్మికులకు స్ఫూర్తినిస్తూ ఏటా మే 1వ తేదీన మే డే కార్యక్రమం నిర్వహిస్తారు. నరసన్నపేట జట్టు కలాసీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్మిక దినోత్సవంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అనేక పథకాలు అమలు చేస్తూ కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. కార్మికుల పతాకాన్ని ఆవిష్కరించారు. నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో కార్మిక సంఘాల, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని కార్మికుల హక్కులు, సంక్షేమంపై గళం విప్పారు. సమాజ పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమేనని, పనికి తగ్గ వేతనం, వారి సంక్షేమానికి తగిన ప్రాధాన్యమివ్వడమే మనమిచ్చే నిజమైన గౌరవమన్నారు. అనంతరం ఎర్రజెండాను ఆవిష్కరించి, కార్మికుల శ్రేయస్సు కోసం చేసే పోరాటంలో అశువులు బాసిన వారికి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: జట్టు కలాసీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



హిరమండలం: అవలంగిలో మాట్లాడుతున్న జేడీయూ జిల్లా అధ్యక్షుడు బి.రాజేశ్వరరావు



సరుబుజ్జిలి: సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు



పాతపట్నం: ఆల్‌ఆంధ్రా రోడ్డులోని సీఐటీయూ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి, సెల్యూట్ చేస్తున్న సీఐటీయూ నాయకులు



బూర్జ: కొల్లివలసలో సీఐటీయూ జెండా ఎగురువేస్తున్న మండల నాయకులు



కొత్తూరు: నాలుగు రోడ్ల కూడలిలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు

చిన్నారికి రూ.10 వేల పింఛన్ అందజేత



మెళియాపుట్టి:చిన్నారికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కొత్తూరు: పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భగవాన్

మెళియాపుట్టి: మండలంలోని వసుంధర గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి పాలక శ్యామల పుట్టుకతోనే సికిల్‌సెల్ ఎనీమియా (రక్తహీనతకు సంబంధించిన) వ్యాధితో బాధపడుతుంది. పేదకుటుంబానికి చెందిన చిన్నారికి ప్రతీ రెండు, మూడు నెలలకు ఒకసారి రక్తం ఎక్కించడానికి తల్లిదండ్రులు సంపతిరావు, కన్యాకుమారి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గతంలో గడపగడపకు కార్యక్రమానికి వచ్చిన సమయంలో ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే రెడ్డి శాంతి దృష్టికి తీసుకెళ్లారు. ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే వారికి న్యాయం చేస్తామన్నారు. అందులో భాగంగానే ప్రతీ నెలా రూ.10 వేల పింఛన్ వచ్చేలా కృషిచేశారు. సోమవారం వసుంధర గ్రామానికి ఎమ్మెల్యే వెళ్లి చిన్నారికి పింఛన్ అందించారు. సర్పంచ్ అప్పలనాయుడు, ఎంపీటీసీ జనార్దన్(చిట్టి), వైఎస్సార్‌సీపీ నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లానబాలరాజు, సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జి జయమునిరావు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి..

కొత్తూరు: మండలంలోని సోమరాజపురం గ్రామానికి చెందిన శిమ్మ ప్రలయమూర్తి శ్రీకాకుళం కిమ్స్‌లో వైద్యం పొందుతున్నాడు. గ్రామ వలంటీర్ సురవరపు భగవాన్ 60 కిలో మీటర్ల దూరంలో ఉన్న కిమ్స్‌కు సోమవారం వెళ్లి ప్రలయమూర్తికి వృద్ధాప్యం పింఛన్ అందజేశారు.

కుప్పిలికి 'సుకవి విభూషణ' బిరుదు

ఆమదాలవలస: హైదరాబాద్‌లోని పటాన్ చెరువులో తెలుగు వెలుగు జాతీయ సాహిత్య సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవితల పోటీల్లో ప్రథమ బహుమతి వరించినట్లు ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావు తెలిపారు. తనకు 'సుకవి విభూషణ' బిరుదు ప్రదానం చేసినట్లు సోమవారం చెప్పారు. ఆరు రాష్ట్రాల నుంచి 183 కవితలు పోటీ పడ్డాయన్నారు. తాను రచించిన 'జింక బాణం సంధిస్తే' కవితకు ప్రథమ బహుమతి లభించిందని, 'సుకవి విభూషణ బిరుదును తానా సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ ఆదివారం అందించినట్లు తెలిపారు. తెలుగు వెలుగు ఫౌండేషన్ అధ్యక్షుడు మూర్తి, కార్యదర్శి మోటూరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. రాజారావుకు బిరుదు రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.



బిరుదు, ప్రసంశాపత్రాన్ని అందుకుంటున్న రాజారావు

ఒండ్రుజోల రేషన్ డీలర్‌పై విచారణ

కొత్తూరు: మండలంలోని ఒండ్రుజోల రేషన్ డిపో డీలర్ రేగాన లక్ష్మిపై అందిన ఫిర్యాదుల మేరకు విచారణ చేట్టాలని టెక్కలి సబ్ కలెక్టర్ స్థానిక తహసీల్దార్ పి.బాలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒండ్రుజోల రేషన్ డిపో పరిధిలో ఉన్న కార్డుదారులతో మాట్లాడారు. డీలర్ ప్రతినెలా వేలుముద్రలు వేయించుకుని బియ్యం పంపిణీ చేయడం లేదని పలువురు చెప్పినట్లు తహసీల్దార్ తెలిపారు. నివేదికను సబ్ కలెక్టర్‌కు అందజేస్తానన్నారు.



విచారణ చేస్తున్న తహసీల్దార్ బాల

సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



కలశాలతో ఆలయానికి చేరుకున్న భక్తులు

జలుమూరు: గొటివాడలో వీర వెంకట సత్యనారాయణ స్వామివారి స్థిర కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. అర్చకులు మోగంటి ప్రసాద్ ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజతో ప్రారంభమై, స్వామివారి విగ్రహ శోభయాత్ర నిర్వహించారు. కోలాటం నిర్వహించి పలు భక్తిగీతాలు ఆలపించారు. మంగళవారం హోమాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, బుధవారం స్థిరప్రతిష్ఠ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త సోమినేని సంజీవ్, ఆలయ కమిటీ చైర్మన్ మొయ్యి లక్ష్మణమూర్తి తెలిపారు.

అదనపు పరిహారం అందజేయాలి

కొత్తూరు: వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారం పంపిణీ చేయాలని మండలంలోని పారాపురం సచివాలయం వద్ద రైతులు సోమవారం ధర్నా చేశారు. ప్రభుత్వం చెల్లించిన అదనపు పరిహారం కొంత మందికే అందిందన్నారు.

మిగిలిన నిర్వాసిత రైతులకు ఏడాది కావస్తున్నా.. అదనపు పరిహారాలు చెల్లించక పోవడం అన్యాయమని పారాపురం మాజీ సర్పంచ్ జి.రామారావుతోపాటు పలువురు రైతులు అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారాపురం రైతులకు అదనపు పరిహారాలు చెల్లించాలని కోరారు.

ఉపాధి పనులు పరిశీలన

సారవకోట: మండలంలోని కూర్మనాథపురం పంచాయతీ బంజీరుపేట గ్రామంలో గల చెరువులో సోమవారం ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. అనంతరం చెరువుకున్న స్లూయిజ్‌ను పరిశీలించి, పనులు చేయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వేతనదారులకు పలు సలహాలు, సూచనలిచ్చారు. సర్పంచ్ బాబూరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డేపల్లి సుధాకరరావు, పొన్నాన మోహనరావు ఉన్నారు.